# సింహాద్రిరావు జలగండం

చంద్రుడు పడమటి దిక్కునుంచి ఆఖరివెన్నెలలు నవ్వుతున్నాడు తెలతెల్ల వారుతూండగా ఏవో పుంజీడు చుక్కలు మాత్రమే వెలవెల పోతున్నాయి. తెరచిఉన్న కిటికీల ద్వారా రెండు గుడిసెలలోని దీపపు బుడ్లు ఆకాశంలో చుక్కల కంటె బాగా మిణుకు మిణుకు మంటున్నాయి. చెట్లగుబురులలో, కొండగుహలలో చీకటి దాగు కొంటూంది. పడమటి దిక్కున ఉన్న మబ్బులకంటె తూర్పు దిక్కునఉన్న మబ్బులే కాస్త స్పష్టంగా ఉన్నాయి. మంచు తడితో కలిసినగాలి వీస్తగా మానవులు దుప్పట్లను మరింత బిగువుగా లాగుకొంటున్నారు. తమ నిద్ర అయిపోయిందని పక్షులు కొమ్మలచివళ్ళను కూర్చుని కేకలు పెడుతున్నాయి. కొన్ని ఎగిరి దూరంగా పోయి మళ్ళా బుద్ధి తిరిగి వెనక్కి వస్తున్నాయి. బోయ పాడు గ్రామంలో మనుష్యుల సందడి కాస్తకాస్త మొదలు పెట్టింది.

సింహాద్రిరావు లేచి పక్కమీద కూర్చుని "లోకం ఇంకా మొద్దు నిదరలోనే పడిఉందా?" అనుకొంటూ పక్కకి చూశాడు. కాంపుకాట్ మీద డిప్టీఇనస్పెక్టరు కదిలి బద్ధం తీర్చుకొంటున్నాడు. "ఓహో! చురుకు దనం!" అన్నాడు సింహాద్రిరావు. కాని ఇనస్పెక్టరుకు ఇంకా నిద్రమబ్బు విడలేదు.

సింహాద్రిరావు కళ్ళతోటి, ముక్కుతోటి, నాలుకతోటి కాఫీ గళాసుకోసం ఎదురు చూస్తున్నాడు. లేచి కాలకృత్యాలుతీర్చుకొనివచ్చేరు ఇనస్పెక్టరు. అతన్నిచూసి సింహాద్రిరావు "పొద్దున్న కుడితి అయిందా?" అన్నారు.

"అప్పుడే ఎక్కడ ?" అన్నాడు నందకిశోరరావు మందంగా
"ఏముంది ! పశువులకది. నరపశువులకిది !" అన్నాడు. సింహాద్రిరావు.

ఇంతటిలో ఉపాధ్యాయులు తెచ్చిపెట్టగా స్నేహితు లిద్దరూ ఫలహారసమేతంగా కాఫి పుచ్చుకున్నారు.

ఇనస్పెక్టరుకుర్చీమీద కూచున్నారు. స్నేహితుడు స్టూలుబల్లమీద ఆసీను డయ్యేడు. వుపాధ్యాయుడు చేతులు కట్టుకొని ఎడంగా నిలబడ్డారు.

నందకిశోరరావు సింహాద్రిరావుని చూసి "మొహం పీక్కుపోయి నల్లగా వుందేమి ?" అని "పైనమేఘం ఏలాగూ దుర్దినమని సూచిస్తూంది కదా !" అన్నారు.

"ఆమబ్బు మననేమి చేస్తుందయ్యా ! వెధవమబ్బు ! దానికి మనం అందుతామూ ? మనకది అందుతుందా !" అని ఆకాశంవైపు చేతులుచాచి సింహాద్రిరావు "ఆమాటికి వస్తే మన తలకాయలలోనె ఉన్నాయి. కావలసిన వన్ని మబ్బులు" అనివేగంగా "రాత్రంతా అడివికలలే ! పాడు కలలు !" అన్నాడు.

"కలలలో అడివి కలలు. పెళ్లికలలు అంటూకూడా ఉన్నాయా ఏమిటి ? నాకుతెలియదు. నిద్రపోయినవాడికి అసలే తెలియదు" అన్నాడు ఇనస్పెక్టరు.

"అదికాదయ్యా ! రాత్రంతా వెధవఅడివి కలలే !" అన్నాడు సింహాద్రిరావు మళ్ళా.

"అయితే అడివిలో మంచి కలలు ఏలాగు వస్తాయి !" అని నందకిశోరరావు ఆశ్చర్యన్ని ప్రకటించేడు.

'మనఖర్మం కొద్దీ !' అన్నాడు సింహాద్రిరావు.

'ఇంతకీ ఏమికల వచ్చిందేమిటి ?' అని అసలుసంగతి తెలియగోరేడు ఇనస్పెక్టరు.

'అంతా సముద్రమే! అంతా నీళ్ళే! అంతా ప్రవాహమే! ఓమ్ బాబో! జలమయం! జలమయం! అంటూ మునిగిపోతూన్నవాడిలాగు చేతులు పైకెత్తేడు సింహాద్రిరావు.

'బాగానే ఉంది.'

'ఇంకా విను! మనమిద్దరం పడవఎక్కి ఎక్కడికో పోతున్నాముట! పోగా పోగా పడవ మునిగిపోయిందిట! ఇంతకీ కథకి కాళ్ళేమిటి! కలకి తలకాయేమిటి నా మొహం. అసలు సంగతి నేను తేలినట్లు. నీవు మునిగినట్టువచ్చింది. దిక్కుమాలినకల!' అన్నాడు సింహాద్రిరావు.

'ఓస్! ఇంతేకదా! నట్టనడుమ సముద్రంలో ఎవడు మునిగినా ఎవడు తేలినా ఒక్కటే! అది అలాగుంచు. కలలో చావువస్తే పీడవదిలి పోతుందంటారు పెద్దలు. పోనీలే? భూమిమీద కొంత సేపైనా బాధలేకుండ చేసేశావు!" అన్నాడు నందకిశోరరావు చిరునవ్వుతో.

'అది సరే, ఆలాంటికల అసలు రావడమే తప్పు!' అన్నాడు సింహాద్రిరావు.

'ఏమి! ఎందుచేత?' అని ప్రశ్నిస్తూ ఇనస్పెక్టరు' కలలో వెల్లువ, సముద్రం, ఇలాంటివి కనబడడమే శుభం అని పెద్దల వాక్యం' అన్నాడు.

'కాని నేనూ కనిపెట్టి చూస్తున్నానుగా' నాకంతా వ్యతిరేకంగాలో మంచివస్తే! చెడ్డజరుగుతూంది. చెడ్డవస్తే మంచి జరుగుతూంది. శకునం ఎదురైతే ఆ రోజున కొంప మునిగిపోయిందన్నమాటే. అపశకునం కనకవస్తే బతికేనన్నమాటే!' అన్నాడు సింహాద్రిరావు గుడ్లుపెద్దవి చేసి.

'అంతా తలకిందులు తలకిచెప్పులు! ఆవుకి పెడదామంటే కుక్కకి. కుక్కకి పెడదామంటే ఆవుకి అన్నదికూడ ఒక పద్ధతే? నీ సంగతీ ఆలాగే ఉంది!' అన్నాడు నందకిశోరరావు.

దగ్గర నిల్చున్న ఇద్దరు ఉపాధ్యాయులు చిత్రంగా వింటున్నారు.

ఇంతలో లబ్బర్తిగ్రామంనుంచి ఒక ఉపాధ్యాయుడువచ్చి నమస్కరించేడు.

అతన్ని ఇనస్పెక్టరు క్షేమంగా ఉంటున్నావా?' అని కుశల ప్రశ్న వేసేడు.

సింహాద్రిరావు అడ్డువచ్చి క్షేమం క్షామంగా ఉంటూందిటయ్యా! అని అడిగాడు.

కాని తనను అని గ్రహించక ఉపాధ్యాయుడు.

'చిత్తం! తమదయండి! తమదర్శనం చేద్దామని వచ్చేనండి!' అన్నాడు.

"ఒక్క దెబ్బకి రెండుపిట్టలు పడ్డాయిట! కలిసికొట్టరా కావేటి రంగా అన్నాడుట!" అన్నాడు సింహాద్రిరావు.

'ఎవరో ఈ పెద్దాయన' అనుకొంటూ విస్తుపోయి చూస్తున్నాడు లబ్బర్తి ఉపాధ్యాయుడు.

ఇనస్పెక్టరు "పంతులూ స్టేటుమెంట్లు సిద్ధంగా ఉన్నాయా?" అని ప్రశ్నించేడు.

"పరీక్షకి కావలసిన రికార్డు అంతా సిద్ధంగా పెట్టేనండి!" అన్నాడు పంతులు!

"అదికాదయ్యా నేనడగతం. స్టేటుమెంట్లమాట?" అన్నాడు ఇనస్పెక్టరు గట్టిగా.

ఉపాధ్యాయుడు వెర్రిమొహం వేసేడు.

'అదే మీతో వచ్చిన అల్లరి! మేష్టర్లు మంచివాళ్లే. బడిపాకలూ మంచివే. అంతా అడివేకాబట్టి! ఏదో బడిని కాపలాకాస్తూంటారు.' అంతవరకు బాగానేఉంది కాని స్టేటుమెంట్ల దగ్గరే మీకూ మాకూ లటపట!" అన్నాడు నందకిశోరరావు.

మౌనంగా నిల్చున్నాడు పంతులు.

"మౌనం అర్ధాంగీకారం" అన్నాడు సింహాద్రిరావు.

ఇనస్పెక్టరు హెడ్‌మాస్టరు వైపు చూసి మన కార్యక్రమం మార్పు చెయ్యవలసివచ్చిందయ్యా! ముందుగా లబ్బర్తి వెళ్ళి స్టేటుమెంట్లు

పూర్తిచేసుకోక పోతే మనం చేసేది ఇహనేముంది! రూలు ఉందనుకో స్టేటుమెంట్లుచేసి ఇయ్యనిదే బడి పరీక్ష చెయ్యనక్కరలేదని.

ఆరూలు ప్రకారం వెళ్ళితే ఈ డివిజన్‌లో ఒక్క బడికూడ తణిఖీ చెయ్యనక్కరలేదు. రూలు ధోరణి రూలుది మన ధోరణి మనది అయితేనే ఈ అడవిలో పనులు జరగడం. మీరు మీ ఇనస్పెక్టరుకి కలిగించే సౌఖ్యం ఇది! ఊరికే నేను చిరాకుపడి, మీరు మథనపడి లాభం లేదు. ఎంతచెప్పినా మీకు బోధపడదు. కాబట్టి మనం పెందరాడే ఇక్కడి నుంచి కదిలి. ఆపని మొదట చూసుకోడమే బుద్ధికి లక్షణం!" అన్నాడు.

ఉపాధ్యాయులు ఇనవు తున్నారు.

ఇనస్పెక్టరు కార్యక్రమం ఎంతటికో మారిపోయిందో అని సింహాద్రిరావు ఆశ్చర్యపోతూ, పెద్దసంతులును దగ్గరకు పిలిచి, చెవిలో "నిన్నటి టీ పార్టీ ఇవాళ పెట్టుకోందామన్నావు! చూశావా పుసుగునాకి పోయేది." అన్నాడు.

"నిజమేనండి! మాకూ ఏకూ అంత మాత్రం తేడా ఉంటదేమిటండీ!" అన్నాడు పెద్దపంతులు విశ్వాసంతో.

"మళ్ళీ నీకు తలకాయి మేష్టరని పేరు. ఎందుకు" అన్నాడు సింహాద్రిరావు:

"పేరుకి పెద్దకి ఏమిటిలెండి! ఇంటిపేరు కస్తూరి వారన్నసామెతే ఉంది. ఎనుపెద్ద అన్నిటిలోకి. తాడిచెట్టు పెద్ద!" అన్నాడు పెద్దమేష్టరు కృతజ్ఞతతో.

చిన్నపంతులు" తమకి బడి ఎప్పుడంటే అప్పుడు సిద్ధంగా ఉందండి!" అన్నాడు ఇనస్పెక్టరుతో,

ఇనస్పెక్టరు మూలిగేడు?

"అదేమిటయ్యోయ్!" అన్నాడు సింహాద్రిరావు.

"నేను ఈ రోజున బండెక్కను!" అన్నాడు ఇనస్పెక్టరు.

"అదేమిటండి బాబూ! బండి సిద్ధంగా ఉంటేనే!" అన్నాడు పెద్దపంతులు ఆశ్చర్యపోతూ.

"బండి కుదుపుకి ఒళ్ళంతా పులిసిపోయిందయ్యా! ఇక్కడ రోడ్లా ఏమైనా! వెధవరాళ్ళు. బండలు! ఎగుడు దిగుడులు! ఇదేకాదూ రోజా అంటే! బండిలో కూర్చుంటే దాగలిలో వెలగకాయలాగు. దెబ్బలుతిన్న టెన్నిసు బంతిలాగు అటు ఇటు ఎగురుతూండడమే! ఒళ్ళు హూనమయిపోయిందనుకోవమ్మ! అందుచేత నేను కుదుపులేకుండ నడచివస్తాను. మరి సామాను బండిలో వేసుకొని మీరు వెనకనుంచి రండి!" అన్నాడు అధికారి!

ఉపాధ్యాయులు ఇనస్పెక్టరుకి చెప్పినా లాభంలేదని ఊరుకొన్నారు.

"ఏమయ్యోయ్! అదు మూడయేది మూడు ఆరయేది. ఇటు సూర్యుడు అటుపొడిచేది. నేను మాత్రం ఇక్కడ బండిలో పెట్టిన కాలు మళ్ళీ ఊరుచేరేకే కిందికి దించడం!" అన్నాడు సింహాద్రిరావు.

"బండిలోంచి బోల్తాపడ్డ సంగతి అప్పుడే పాత పడ్డది పెద్దమనిషికి!" అని నందకిశోరరావు అనుకొని "నీ ఇష్టం! నువ్వు బండిఎక్కుదెరా! అని. "సరే! అయితే నేను లబ్బర్తి పంతులుతో ముందు నడిచిపోతాను" అని లేచేడు.

"తమ ఇష్టం!" అని ఊరుకొన్నారు పంతుళ్ళు.

అధికారి గుడ్డలు వేసుకోడానికి వెళ్ళేడు.

లబ్బర్తి ఉపాధ్యాయుడు తక్కిన ఇద్దరి ఉపాధ్యాయులను పక్కకి తీసుకొనివెళ్ళి "ఆ రెండో ఆయన ఎవరు!" అని ప్రశ్నించగా, వాళ్ళు "సింహాద్రిరావుగారు! మీకు తెలియదా!" అన్నారు.

"అలాగటయ్యా! సరి! సరి! అన్నాడు పంతులు,

"నవ్వితే చంపేస్తాడు!" అని సూచించేరు మేష్టర్లు.

"పంతులు పక్కకి తిరిగి నోరునొక్కుకొన్నాడు.

అధికారి దిరీసు వేసుకొని కొత్తపాల కర్రతో ఇవతలకివచ్చేడు.

లబ్బర్తి పంతులు, బంట్రోతు వెంటరాగా అతను కాలినడక పుచ్చుకొన్నాడు.

ఇనస్పెక్టరు వెళ్ళిపోయేడు కదా. ఇంక తొందరేముంది. మనం నింపాదిగా బయలుదేరి వెళ్దాం అని తక్కిన వాళ్ళు అనుకొన్నారు. అప్పుడే వస్తుందన్నబండి తయారయి వచ్చేటప్పటికి మూడుగంటల వేళ పట్టింది. ఈ లోపల సింహాద్రిరావు ఫలహారాలతోను, పానీయాలతోను కాలక్షేపంచేసి చివరకు "మృష్టభోజనం!" అంటూ గునిసేడు.

బండిలో సామాను వడేసి అందరూ ఎక్కేరు.

"దారి ఎలాగుందయ్యా పెద్దపంతులూ!" అని వాకబుచేసేడు సింహాద్రిరావు.

"అన్నిదారులూ ఒక్కటేనండి!"

"పుర్ర చేతికి, ఎండచేతికి తేడా ఏమిటంటావు!" అన్నాడు సింహాద్రిరావు.

"అదీ ఇంకా నయమేనండి!"

"అయితే దారులన్నీ గోదారులే అంటావు!" అన్నాడుసింహాద్రిరావు.

"ఇక్కడ అలవాటు పడ్డవాళ్ళకే ఇది దేశంకాని తమవంటి ప్రభువులకి కాదండి!" అన్నాడు చిన్నపంతులు. ఉన్నసంగతంతా విశదపరిచనట్లుగా.

"దారిలో పెద్దపులులు ఢీకొనవుకదా?" అని సింహాద్రిరావు భయాన్ని కప్పిపుచ్చుతూ పలికేరు.

"పగలు అవేవీ మనకి కనబడవండి!" అన్నాడు హెడ్‌మాస్టరు సన్నగొంతుకతో.

"ఇక కాలమేనా మనకి అప్పచెప్పేయ్ వాటిధర్మమూ అంటూ!" అని సింహాద్రిరావు సంతోషించి "ఇంకా విశేషాలేమిటి?" అని అడిగేరు.

"ఇక వాగుకి మాత్రం బంకి అడ్డంగా వెళుతుందండి! అంతకి మించి కొత్తవిశేషా లేమీ కనబడవండి!" అన్నాడు చిన్నపంతులు.

"వాగంటే?" అని ప్రశ్నించేడు సింహాద్రిరావు అర్థంగాక.

"వాగంటే కొండకాలువండి!" అని జవాబు చెప్పేడు చిన్న మేష్టరు.

"అంతేకాని పనరడం, పేలడం కామకదా! ఇవన్నీ నాకుకొత్తలే! అయితే వాగు పెద్దదిగా ఉంటుందా, చిన్నదిగా ఉంటుందా?" అ ప్రశ్నించాడు సింహాద్రిరావు.

"ఒక మోస్తరుగా పెద్దదనే అనాలండి!" అన్నాడు పెద్ద పంతులు.

"లోతు?"

"లోతెక్కువండి!" అని నోరుపప్పరించేశాడు పెద్దపంతులు.

"అదేమిటయ్యోయ్! కాలువ, ఏరు, నది లోతు లేకుండానే ఉంటాయా ఎక్కడేనా! మా ఊళ్లో ఉప్పుటేరు చూడు. చూడడానికే భయం వేస్తూంటుందో లేదో! ఎంతేసి పడవలు, ఎంతేసి స్టీమర్లు దాంట్లో తిరుగుతూంటాయో! అందులో పడ్డవాడికి మోక్షమే!" అన్నాడు సింహాద్రి రావు.

"దానికి దీనికి పోలికేమిటండి!" అన్నాడు చిన్నపంతులు.

"పోనీ నీరు ఏమాత్రముంటుందో చెప్పుమూ!" ఆగోలంతా నాకెందుకు!" అన్నాడు సింహాద్రిరావు.

'వాగుకి నీళ్లేమిటండి పంతులుగారూ!' అన్నారు పెద్దమేష్టరు ఆశ్చర్యంగా!

'ఎప్పుడేనా వర్షం కురిసినప్పుడు దడదడ వస్తుంది. అ తర్వాత వట్టి ఇసకే!" అన్నాడు చిన్నపంతులు.

'బాగానే ఉందయ్యోయ్! ఈ అడవిలో చిత్రాలలో ఇదొకటి!" అని సంతోషించేడు సింహాద్రిరావు!

'పైగా ఈ అడివిలో ఎప్పుడు వర్షం వచ్చిపడుతుందో, ఎప్పుడు మానుతుందో చెప్పలేమండి!" అని పెద్దమేష్టరు సూత్రీకరించేడు.

'ఇవాళ ఆకాశం చూస్తే అనుమానంగానే ఉందండి!' అన్నాడు చిన్నపంతులు.

"వాన రాకట, ప్రాణపోకట అన్నసామెత ఈ మన్నెంలోనే పుట్టిందనా యేమిటనీ ఊహ! వాన ఎప్పుడు వస్తుందో చెప్పలేము! పెద్ద పులి ఎప్పుడు ఎత్తుకుపోతుందో చెప్పలేము!" అన్నాడు. సింహాద్రి రావు.

'ఇవాళ లక్షణం చూస్తే మొత్తంమీద ఒకజల్లు దిగేటట్లా ఉందండి చిన్నపంతులు.

"ఆ పని పొద్దున్నే అవుతుందని ఎదురు చూశామండి!' అన్నారు పెద్దపంతులు. ఆకాసంవైపు మొహంతిప్పి.

'ఏమో ఇంత వరకు పడలేదుమరి! మన అదృష్టం మెలాగుందో!' అన్నాడు చిన్నపంతులు.

'మనమే అదృష్టవంతుల మయితే. కిందపెడితే పంతులు మీద పెడితే వానలుఉండవంటావు! ఈ క్షణంలో మనకి కావలసినది అలాంటి అదృష్టమే!" అన్నాడు సింహాద్రిరావు.

ఒక్కొ టొక్కటే చినుకు బండిగూటిమీద టపటప రాలు తూంది.

సింహాద్రిరావుకి కళ్ళముందర వాగు హూరెత్తి పొర్లుతున్నట్లుగా తోచి 'అయితే పెద్దపంతులూ! గోదావరి ఒడ్డు దగ్గిర పిల్లలు నీటిలోపడి కాళ్ళుచేతులు కొట్టుకొంటూంటారు. చూశావూ? ఆలాగు వాగుకి అడ్డపడి ఈతకొట్టెయ్యమన్నావేమిటి?" అన్నాడు.

"మోకాటిలోతుకూడ లేనివాగులో ఈ తేమిటండి నామొహం!' అన్నాడు పెద్దపంతులు.

"మనకి ఈ జన్మలో పట్టుబడని విద్య అదొక్కటేనయ్యా! మళ్ళీ థియరీ ఘణ్ణంగా వచ్చు. మాటికి నూటపాతిక మార్కులు పెట్టవలసిందే పులుసోద పెట్టినట్లు. కాని కాలు నీళ్ళలో పెట్టడమంటేనె వస్తుంది పెద్ద పులికిలాగు. అన్నట్లు పెద్దపులి నీటిలో పాదం పెట్టదుకామా?" అన్నాడు సింహాద్రిరావు.

"ఔనండి! తడికి ఓర్వలేదండి వెధవగొడ్డు! అన్నాడు పెద్ద పంతులు.

"అనుగదే నేను చెప్పడమున్నా! నేను మట్టుకు నీటిలోకాలు పెట్టడమె వస్తే తిమింగలంలాగు నీటి ఏనుగులాగు ఈదెయ్యనూ! కాని ఈ ప్రాణానికి ఎప్పటికేనా ఆదేముప్పు! ఈతవచ్చినా లాభంలేదు. గజ ఈతగాడికి నీటిగండం అని సామెత. జాతక చక్రంవేసి గుణించినా, గోచారరీత్యా చూసినా, అరచేతిలో రేఖలు చదివినా. జీవుడికి జలగండంలోకాని కైలాస ప్రాప్తిలేదని దైవజ్ఞులు ఇదివరకే నిర్ణయించేరు. నిండలేనిదే బొందెపోదుకదా! వాయు పక్షులు పర్ణపక్షులు, వాయునీవార పక్షులే కాకుండ ప్రతి పక్షికోరేదిమున్నా మోక్షమే. కాబట్టి అది ఎలాగు వస్తేమనకేమిపోయింది! నయానోన్నా. భయానోన్నా. ప్రాణభీతితో మంచి జరగడమె కదా కావలసింది!?" అన్నాడు సింహాద్రిరావు వికారమొహం వేసుకొని.

"అంత జంకెందుకండి పంతులుగారూ?" అని విమర్శించేడు పెద్దఅయ్యవారు.

అబ్బే! ఎంతమాట! అని సింహాద్రిరావు "అబ్బాయీ!" అన్నాడు పెద్దమేష్టరువైపుచూసి.

"అయ్యగారూ!"

"పెద్దలు ఈ పిలకెందుకుంచేరో ఎరుగుదువా!" అన్నాడు సింహాద్రిరావు, పిలకనుచేతితో పట్టుకొని, బుర్ర బోరకూడ కదిలిస్తూ.

'ప్రాచీన సంప్రదాయాలను నవీన అభ్యాసాలను బంధించే సూత్రం కావాలండి!"

"అబ్బే! ఉత్తది! అవన్నీ పైపైమాటలు! ముఖప్రీతి కబురులు! అసలు విషయం, అంటే లోపలి భావం! అనగా గుట్టు వేరు. ప్రతి మానవుడికి జలగండం ఒకటి తప్పదనే సంగతి త్రికాలజ్ఞులు రూఢిపరచగా! నీటిలో పడిపోయిన మానవుడ్ని సుళువుగా అందిపుచ్చుకొని, లేవనెత్తి గట్టున పారేసే సాధనం ఇదొక్కటే!

ఆయుర్దాయముంటే ఆ తర్వాతవాడే బతుకుతాడు. వెనకటి మన వాళ్ళు కొన్ని కొన్ని ఉట్టినే ఏర్పరిచేరని పిడివాదన వేసుకొని కూర్చుంటాము. అప్పటికి వాటి భావం మనకు అంతు పట్టనిమాట నిజమే! పోగా పోగా వాటిలోతు విశదమవుతుంది. దానికి నిదర్శనమే ఈ పిలక!" అన్నాడు సింహాద్రిరావు. పిలకని జాడిస్తూ.

అతని వెర్రిభయంచూసి ఉపాధ్యాయులు చిరునవ్వు నవ్వుకొన్నారు.

వాన జోరుగా సాగుతూంది. బండి గూడు గట్టిగా ఉంది. అందుచేత లోపలి వాళ్ళు అట్టే తడియడంలేదు. కాని అక్కడికంటె ఆ పైన కొండలమీద బాగా వర్షంపడింది. అంతా జడివాన! కురిసి వెలిసిపోయింది. నెమ్మదిగా ఎడ్లు బండిని వాగుదరికి చేర్చేయి. వాగు నురగలు కక్కుకొంటూ, రైయిమని ఇంజన్ మోతలాగు పారుతూంది! నీరు నక్కనెత్తురులాగుంది.

సింహాద్రిరావు గుండెలలో రాయిపడింది! "చావుమూడిందిరా జీవుడా?" అనుకొంటూ, పైకికొంత బింకంగా "మనగతేమిటి?" అన్నాడు.

"ఏముందండి! కళ్లుమూసుకు కూర్చోండి. ఎడ్లే "అవతలిగట్టుకు చేరుస్తాయండి?" అన్నాడు పెద్దపంతులు అవలీలగా.

"అమ్మయ్యో, ఈ ప్రవాహంలో ఎడ్లు, మనమూకూడా కొట్టుకుపోతేనో?" అన్నాడు సింహాద్రిరావు దిగులుతో.

"ఇదొక ప్రవాహంటండీ!" అన్నాడు పెద్దపంతులు.

"ఏమాత్రం లోతుంటుంది?" అని సింహాద్రిరావు తెలుసుకోగోరేడు.

"మహా ఉంటే మోకాటిలోతు!" అన్నాడు పెద్దపంతులు.

"మోకాటిలోతే!" అని గుండె బాదుకొన్నాడు. సింహాద్రిరావు ప్రవాహవేగం గమనించి.

"కపోతే మోకాలు కూడ కాస్త మునిగేనో!" అన్నాడు పెద్దపంతులు.

సింహాద్రిరావుకి ముందుకి వెళ్ళడానికీ తోచలేదు. వెనక్కి వెళ్ళడానికీ తోచలేదు! "పరమేశ్వరుడే కాపాడాలి ఇటువంటప్పుడు!" అనుకొన్నాడు. బండి నడిపించవద్దు!" అంటూ అతను కిందికి దూకేశాడు.

"మీ కెందుకండి భయం బండిలో కళ్ళుమూసుకొని కూర్చోండి. లేకపోతే హాయిగా పడుకోండి. అదే చల్లగా తీసుకుపోతుంది!" అన్నాడు పెద్దమాస్టరు.

"మీరు గప్‌చిప్‌గా కూర్చోండి. ఇదొక ఏరా, ఇదొక నీరా!" అన్నాడు చిన్నమేష్టరు.

"మీకు తెలియదులెండి! చెయ్యికాలేక ఆకులు పట్టుకొనే రకం కాదిది. ముందుచూపు ముందు ఆలోచన తలనిండా ఉరకలు వేసుకొంటూ ప్రవహిస్తుంది!" అన్నాడు సింహాద్రిరావు!

"అయితే ఏమిచేస్తానంటారు!" అని అడిగేడు పెద్దఉపాధ్యాయుడు,

"నామాటవిని మొట్టమొదట బండిని ఏటిలోంచి తోలుకుపొమ్మని చెప్పు. దానితో లోతు సంగతి పూర్తిగా బోధపడుతుంది." అన్నాడు సింహాద్రిరావు.

"ఎంతచెప్పినా సింహాద్రిరావు వినేటట్లు తోచకపోగా పంతుళ్ళు ఆ ప్రకారమే చెయ్యమని బండివాడికి తెలుపగా. వాడు ఎడ్లని నీటిలోకి దింపేడు, బండి నడుస్తూంది పెద్దగుర్రాలనందులాగు నీరు చుట్టుముట్టింది.

వెర్రిగంతులు వేస్తుంది. బండి కుంపండగ్గరకి కూడ నీరురాలేదు. కాని అనుక్షణం బండి తిరగబడిపోడం కోసం, ఎడ్లుబండివాడు కొట్టుకుపోడం కోసం ఎదురు చూస్తున్నారు. సింహాద్రిరావు తనసూట్‌కేస్ సంగతి జ్ఞాపకంరాగా "అరెరే! ఎంత పనిచేశాను! అదేనా తీసి గట్టునపెట్టేసుకొను. వెధవచింతపండు, చేతికర్రలు మొదలైనవి పోతే అడివే మళ్ళీ ఇస్తుంది. దానికి చింతలేదు అని తలపోశాను! కాని బండి సుఖంగా అవతలిగట్టును చేరింది.

"నీటిలో తిమింగలాలు. మొసళ్ళు ఇంకా పెద్దపెద్ద జంతువులు ఉంటాయని పెద్దపెద్ద పుస్తకాలలో రాస్తారుట! అందుచేత నన్ను నీటిలో కాలు పెట్టడానికి లేదు." అన్నాడు సింహాద్రిరావు ముందరి కాళ్ళకి బంధంగా.

"ఇక్కడ మొసళ్ళేమిటండి! దీనిలో చేపలేనా ఉండవు!" అన్నాడు పెద్దపంతులు.

"నీటిలో దాక్కొని వుంటాయి కాని పైకి కనబడతాయా! పట్టుకునే వాటికి వాటికి ఉపాయాలు చెప్పాలిటయ్యా. చేపకి ఈతనేర్పాలిటయ్యా! అంచేత తొందరపడి నీళ్ళలో కాలుపెట్టకూడదు!" అన్నాడు సింహాద్రిరావు నిశ్చయంతో.

"నామాటలు విని నాతోరండి!" అన్నాడు పెద్దమేష్టరు.

మప్పకి పెద్దమేష్టరు నీటిలో దిగుతున్నాడు.

నీటిహోరుకి హడలిపోయి సింహాద్రిరావు చెవులు మూసుకొన్నాడు. కళ్ళుతిరుగుతూ. రక్తంలాగున్న ప్రవాహాన్ని చూడలేక కళ్లు మూసుకొన్నాడు గొంతు కూచ్చున్నాడు.

"దిగండి పంతులుగారూ!" అని పెద్దపంతులు ధైర్యంకలిగించేటట్లు పలికేడు.

సింహాద్రిరావు తిరగబడి "ఏటిలో దిగమంటావుటయ్యా! అదా నీసలహా! చాల పెద్దమనిషివేలే! నేను దిగితే నీసొమ్మేమి పోయింది. ఏడ్చేవాళ్లు ఇంటిదగ్గిర ఉన్నారు. ఏవిధంగా నేనా కబురు అందితేసరి

దిగుదిగుమన్న నాసవితేకాని దిగేనాసవితి లేదని సామెత!" అన్నాడు!

"అతనికి ధైర్యం కలిగించడం కోసం చిన్నఉపాధ్యాయుడు "నేను మీకు తోడుగా దిగుతాను రండి!" అని" ఇదొకనీరుటండి పంతులుగారూ!" అన్నాడు.

"నీకు అట్లాగే ఉంటుంది. తెగించిన వాడికి తెడ్డేలింగం! చచ్చే వాడికి సముద్రం మోకాలు బంటి! సామెతలు ఉట్టినే పుట్టవు? మనబోటి వాళ్ళని చూసి పుట్టినసామెతలే?" అన్నాడు సింహాద్రిరావు.

"అయితే ఏమిటిదారి!" అన్నాడు పెద్దఉపాధ్యాయుడు ఏమీ పాలుపోక.

"ఆలాగు దారిలోకి రండి!" అని కొంత స్దిమితపడి సింహాద్రిరావు నన్ను తీసుకువెళ్ళడం పూచీమీది. నా తలపువ్వు ఆడకుండా తీసుకువెళ్ళి మీ డిప్టీఇనస్పెక్టరుకి అప్పగించడం విధిమీది. పెద్దమనుష్యులారా! నన్నే ఉపాయమూ అడగావద్దు నాకు మతిపోతూంది. తద్దినం కొనితెచ్చునట్లుగా వచ్చింది. అంతా నా కర్మం!" అని కళ్ళు మూసుకొని, మోకాళ్ళమధ్య తలకాయ పెట్టుకొన్నాడు.

"పంతులుగారూ! మేము చెప్పినట్లుగా కాస్త వినండి" అన్నాడు పెద్దమేష్టరు.

"మీబోటి పెద్దలే మాకు దారిచూపించాలి!" అన్నాడు చిన్న మేష్టరు సింహాద్రిరావుని కాస్త ఉబ్బవేద్దామని.

"పుట్టెడు దుఃఖంతో ఉన్నవాడికి చెప్పవలసిన మాటలుటయ్యా ఇవి!" అని కసిరేశాడు సింహాద్రిరావు.

"మేము చెప్పినట్లుగా చెయ్యండి మహారాజా!" అని బతిమాలేడు పెద్దమేష్టరు.

"ఏమిటి మంత్రాంగం?" అని తెలియగోరేడు సింహాద్రిరావు.

"మీరు నిల్చోండిమొదట. మేము చెరోరెక్క పట్టుకొని నడిపించుకు పోతాం!" అని పెద్దపంతులు ఉపాయం చెప్పేడు.

"మానం ప్రాణం ఆచార్లవారి అధీనం అని మొర పెట్టిన ఇల్లాలి కథలాగుంది నీ సలహా! మంచి సలహాయే!" అన్నాడు సింహాద్రిరావు.

"అయితే మీరు చెప్పండి!" అని అడిగేడు పెద్దమేష్టరు.

"నేను ఉపాయం చెప్పేసాకుంటే మీవరకు రానిస్తానా! ఎంత మాట? అరటిపండు ఒలిచి చేతిలో పెటినట్టుగా చెప్పకపోయేనా! నాకు ముందు మతిపోతూంది!" అని పెదిమెలు విరిచేడు సింహాద్రిరావు.

"మొదట మీరు కళ్లు తెరవండి!" అని కోరేడు చిన్నపంతులు.

"దానికి ఫాలాక్షుడు కిందికి దిగిరావలసిందే!" అని సింహాద్రిరావు ఇంకా గట్టిగా మూసుకొని "కళ్ళుమూసుకొన్నవాడికి పెద్దపులి ఎదుట ఉన్నాసరే భయముండదు" అని దానిలో అంతరార్థం తెలియజేశాడు.

గత్యంతరంలేక ఉపాధ్యాయులు చెరో రెక్క పట్టుకొని అతన్ని లేవదీశారు ముందడుగులు వేశారు. కళ్లుమూసుకొనే సింహాద్రిరావు ఎగుడు దిగుడుగా అడుగులు వేస్తున్నాడు. మేష్టర్లు నీటిలో అడుగు పెట్టేరు. పాదాలకు తడి తగలగా సింహాద్రిరావు వెనక్కి వెలబడి "నీరు నిజంగా వచ్చిందా?" అని అడిగేడు.

పెద్దమేష్టరు చిన్నమేష్టరుకి కన్నుగీటేడు.

"అయ్యో! లేదండిబాబూ!" అన్నాడు పెద్దమేష్టరు దీర్ఘం తీస్తూ,

"ఏమయ్యా నువ్వు!" అని సింహాద్రిరావు రెండో మేష్టరుని ఉద్దేశించి అడిగేడు!

'చిత్తం లేదండి అయ్యగారూ" అన్నాడు రెండో అతను.

'మరయితే ఈ తడేమిటి!' అని ప్రశ్నించేడు సింహాద్రిరావు.

"కావలిస్తే మీరే చూడండి!" అన్నాడు పెద్దపంతులు.

'చూడడమే! ఇదంతా మోసగుడు దేశం! రావణరాజ్యం! నేను నమ్మను! నేను అడుగు వెయ్యను!' అని నడవడం మానివేశాడు సింహాద్రిరావు.

మేష్టర్లు అసలకే ఆతనితో అనుభవం ఉన్నవాళ్లు కాబట్టి 'అయితే చెరో భుజంమీద కాలువేసి కూర్చోండి" అన్నారు తప్పనిసరి వచ్చిందని.

'అది మీకిదివరకే తోచక పోవడం, నా ప్రాలుద్దం కాదు. మీ ప్రాలుద్దం. ఏ అవస్థపడకుండా ఈ పాటికి వెళ్ళిపోయుందునుకదా!".

సింహాద్రిరావు వాళ్ళ సలహాను మెచ్చుకొంటూ.

సింహాద్రిరావు మేష్టర్ల భుజాలమీదికి ఎక్కి కూర్చున్నాడు. ఇద్దరి మేష్టర్లూ నెమ్మదిగా అడుగులు వేస్తున్నారు.

'నీరు వచ్చిందా?" అని ఆదుర్దాతో అడిగేడు సింహాద్రిరావు.

'అబ్బే! అప్పుడేనా!! అన్నాడు పెద్దపంతులు.

'నువ్వయ్యా చిన్నతను! నువ్వుచెప్పు!" అన్నాడు సింహాద్రిరావు అతనిమీద గురి ఉన్నట్టు

'అబ్బే! ఇంకా రాలేదండి!" అన్నాడు చిన్నతనుకూడ.

'అయితే ఆ బుసబుసలు ఆ రుసరుసలు ఏమిటి?' అని అడిగేడు సింహాద్రిరావు

'అదంతా ఉట్టిదేనండి?" అన్నారు ఇద్దరు మేష్టర్లూనూ.

'మిమ్మల్ని నమ్మితే ఏటిలో దిగడమే?" అన్నాడు సింహాద్రిరావు అపనమ్మకంపడి. అతను ఊరకే వణుకుతున్నాడు.

మేష్టర్లు జాగ్రత్తగా పట్టిపట్టి నడుస్తున్నారు.

'ఆ చప్పుడేమిటో చెప్పండయ్యా మొదట!' అని సింహాద్రిరావు ఆందోళనపడ్డాడు. అతని అరికాళ్లు అరిచేతులు చల్లగా మంచులాగున్నాయి.

'చప్పుడులేందే?" అన్నాడు పెద్దమేష్టరు.

'ఏమయ్యా నువ్వు!' అన్నాడు సింహాద్రిరావు చిన్నపంతులుతో.

'లేదండి బాబూ!' అన్నాడు చిన్నమేష్టరు సన్నాయి నొక్కులు నొక్కుతూ.

ఈ మోసపుగా బుకాయిస్తూ ఉపాధ్యాయులు శ్రమపడిన ప్పటిదాక వెళ్ళేరు. సింహాద్రిరావుకి వణుకెక్కువయింది. ఉపాధ్యాయులకి పట్టుకోడానికి కష్టమయింది. జలగండం భీతాహం సింహాద్రిరావుని ఆవేశించింది. నవనాళ్ళు పటుతప్పుతున్నాయి. స్మారకం తప్పుతూంది. అతను "హా! జలగండం! హా! జలగండం!" అంటూ తలవేలేశాడు. మేష్టర్లు ఉషారుగా ఉండబట్టి సరిపోయింది. పైగా సింహాద్రిరావు బొమ్మలా తేలికగా ఉండబట్టి కిందపడకుండా ఆకాశంలో వండుకున్నట్టుగా పట్టుకొన్నారు. అట్లాగే శ్రమపడి మోసుకువెళ్ళి గట్టునపడవేశారు.

అతని నోటమాటలేదు. కళ్ళమూతలు ఎప్పటిలాగే ఉన్నాయి. నాడిమాత్రం టకటక కొట్టుకొంటూంది. అతిభయంవల్ల స్మృతి తప్పిపోయిందని వారు భావించేరు. ఎంతో విచారించేరు. "బాబూ! అయ్యగారూ! పంతులుగారు! సింహాద్రిరావుఅయ్యగారూ?" అంటూ అనేక విధాలుగా పిలిచేరు. తమకి చేతయిన ప్రయత్నమంతా వేస్తున్నారు. చివరకి సింహాద్రిరావు నోటినుంచి "ఎవరువారు!" అన్నమాటలు నీరసంగా వచ్చేయి.

"మేమండి ఉపాధ్యాయులం!" అన్నాడు పెద్దపంతులు.

"యమదూతలా! అయితే గేటు గుమ్మందగ్గిర ఉండవలసిందే! లోపలకి రానక్ర్హ తలేదు!" అన్నాడు సింహాద్రిరావు నిష్కర్షగా

"కాదండి! మేము బడిపంతుళ్ళం బాబూ!" అన్నాడు చిన్న పంతులు.

'చచ్చిన వాడ్ని ఇంకా ఎక్కడ చంపుతారయ్యా! ఇదొక అసాధ్యం వచ్చిపడింది! పొండి అవతలకి! లేక పోతే మర్యాదగా దయచెయ్యండి!" అన్నాడు సింహాద్రిరావు.

'కాదండి అయ్యగారూ! తమరు నీటిలోపడనే లేదండి!" అన్నాడు పెద్దపంతులు.

ఔనుగాని! మీరు స్వర్గాన్నుంచి వచ్చారాలేక నరకాన్నుంచి వచ్చేరా!" అని ప్రశ్నించేను.

"మాది పోయపాడేనండి అయ్యగారూ!" అన్నాడు చిన్న పంతులు.

"మళ్ళీ తిరిగి పాపం మీ రొక్కరే దయచెయ్యండి! మిమ్మల్ని చూస్తే నాకు జాలివేస్తూంది కాని ఇంతకీ మీరు ఎవరికోసం వచ్చేరో తెల్పలేదు. తక్కిన గొడవంతా అలాగు కట్టిపెట్టండి! _ ఏమిటీ! సింహాద్రి రావుగారికోసమా! ఆ పేరుగల పెద్దమనిషి ఈ మహాపట్టణం చుట్టుపట్ల మూడామడ ఈ మధ్యలేదు కావనిస్తే చేతిలో చెయ్యివేసి చెప్తా. దయ చెయ్యండి ఇంకమరి! ... పెద్దమనిషి మాటలలో నమ్మికలేనివాళ్లు మీరె లాగు పెద్దమనుష్యులవుతారయ్యా?" అన్నాడు సింహాద్రిరావు

వెర్రి భయంచేత పాపం మతిపోయిందని ఉపాధ్యాయులు భావించి విచారిస్తున్నారు.

"పాపం! తిరిగి మీరు ఒక్కళ్లే వెళ్ళవలసి వచ్చిందికాని ఏమి చెయ్యను! పోనీ దారిఖర్చులేనా ఇచ్చుకొందామంటే పర్సు నీటిలో పడి పోయింది. అదోఅవస్థ! రొంటిని చిల్లరడబ్బులులేవు. ఇంతకీ ఈ జీవు డికి ఇంకా పదికాలాలకైనా స్వర్గప్రాప్తేకాని లోకప్రాప్తిలేదని యముడికి గట్టిగా నచ్చచెప్పండి. మీమట్టుకు మీరు తెలుసుకొని ఈసారు పంపించినా వెళ్ళమని మొండికెయ్యండి!" అన్నాడు సింహాద్రిరావు.

అతని పేలాపన వింటూ ఉపాధ్యాయులు 'ఇది బతికిన ధోరణిగా కనబడదు. చచ్చిన ధోరణిగా కనబడదు! చచ్చినవాడైతే ఏలాగుమాట్లాడ తాడు! బతికినవాడైతే ఎప్పటికీ తెలివిరాదేం!' అనుకొంటూ వేరేఉపాయం తోచక నిలుచుండిపోయేరు. అంతటిలో చీకటి పడుతుందని దిగులు పుట్టింది. పెద్దఉపాధ్యాయుడు ఆఖరిమాట చెప్పదలచుకొని "బాబూ! చీకటి పడిపోతూంది. ఈస్థలమూ, మంచిదికాదు! ఈ కొండమీంచి ఇలా

దిగి పెద్దపులి —" అంటూండగానే సింహాద్రిరావు చటాలున లేచి కూర్చున్నాడు.

"ఓహో! మీరా! మీరేనా! ...ఏమయ్యా ఇందాక వచ్చిన ఇద్దరు యమదూతలున్నూ! హరీ! హా! నా ఖర్మం కాలితే యమభటులారావడం ఏ శ్రీ మహావిష్ణువో వచ్చి దర్శనమిచ్చి పక్కాపోక! పైగా వచ్చినవాళ్ళు ఊరుకోక 'పెద్దపులి! పెద్దపులి!" అన్నారు. అదేమిటి! ఏమయ్యా పెద్ద మేష్టరూ! ఎక్కడికిపోయేరువాళ్ళు? ముందు ఆమాట చెప్పుమా!" అన్నాడు సింహాద్రిరావు.

"లేదుబాబూ! ఇక్కడికెవ్వరూ రాలేదండి!" అన్నాడు పెద్ద మేష్టరు!

"అదివట్టి కలేనండిబాబూ!" అని చిన్నపంతులు జవాబిచ్చేడు.

"బాగానే ఉంది. ఇదివట్టి కలేనని నాలుగు ఎండుపుల్లలు అక్కడా ఆక్కడా ఏరి తెచ్చి గుప్పెడుబూడిదచేసి వాగులోకలిపేశారుకాదు! ఇంకా నయం! నా పిల్లల అదృష్టం బాగుంది! దానిమాటకేమిలే! దానికి మనకి సగమేరిక! పగలు అదృష్టి గతియటూ షష్టాష్టకమే! రాత్రికలలోనే నా ఇదివరకెన్నడూ నరిపడలేను. ఈ జీవుడు భూమిమీద ఉన్నన్నినాళ్ళే మోహాన్న ఇంత పచ్చపు కుంకం మెత్తుతోడు! సవ్యాపస్యంలోనున్న అంశం....ముందుమాట ఏమిటయ్యా పంతుస్యా?" అని ప్రశ్నించేడు సింహాద్రిరావు.

"తమరులేచి బండిఎక్కండి పోదాం." అన్నాడు పెద్దపంతులు.

"బొను—ని పెద్దపంతులూ! బయలుదేరేముందు వర్షమే వస్తుందో. ఉప్పెనో పుడుతుందో. గాలివానే ఊపేస్తుందో, మనం చస్తామో. బతుకుతామో. బుగవుతామో కాస్త చూసుకొని బయలుదేరవద్దుటయ్యా! ఇదా మీ అతిథి సత్కారం!" అన్నాడు సింహాద్రిరావు. అదిగా కళ్ళ కొనలనుంచి చూస్తూ.

"ఏదో మావల్ల పొరపాటే వచ్చిందండి! ఏదో తమరు రాక రాక రావడం ఈ వాన రావడం చూస్తే, ఇదంతా మా ఖర్మంలాగుందండి అయ్యా!" అన్నాడు పెద్ద పంతులు.

"సరే! ఈమాటుకి మీ అజ్ఞానాన్ని మీ అశ్రద్ధని కట్టకట్టి ఒక్క-మాటే క్షమిస్తాను. కాని ఇహముందు జాగ్రత్తకి గమనించండి!" అన్నాడు సింహాద్రిరావు అధికార భంగిమలో "చిత్తం!" అన్నారు ఉపాధ్యాయులు.

"చీకటి పడుతూంటే ఇంకా చూస్తారేమిటయ్యా!" లెండి! లెండి! బయలుదేరండి. బండెక్కండి." అంటూ సింహాద్రిరావు ఒక్క దోపున బండిలో పడ్డాడు. ఇద్దరు ఉపాధ్యాయులు "బతుకుజీవుడా!" అనుకొంటూ బండిఎక్కేరు, ఎడ్లు నడక సాగించేయి.

"ఔనుగాని పంతులుగార్లూ. ఏటిలో పడ్డవాడి గుడ్డలు తడవాలికదా. ఇంత పొడిగా ఉన్నాయేమిటి?" అంటూ సింహాద్రిరావు తన బట్టచూసుకొని అత్యాశ్చర్యపోయేడు.

"బాబూ! తమరు కిందపడకుండా మేము కాసేశామండి." అన్నాడు పెద్దపంతులు సంతోషంతో.

'పందులాగు పట్టేసుకున్నామండి!' అన్నాడు చిన్న పంతులు చేతులతో అభినయిస్తూ.

'అంతేనా! ఇంకా ఏ శ్రీమహావిష్ణువులవారో వచ్చేటప్పటికి ఆయన తేజస్సుకి ఇవి ఎండి చక్కా పోయేయనుకుంటున్నాను!" అన్నాడు సింహాద్రిరావు.

'లేదుబాబూ! ఎవరూ రాలేదండి. మేము చూస్తూనే ఉన్నాం. ఆయన ఈమాటుకి దర్శనం ఇప్పించలేదండి తమరికి' అన్నాడు పెద్ద పంతులు.

"ఇయ్యకపోడమే ఎప్పటికైనా అదృష్టమనుకో! ఆయనగారి దర్శనమయేక వైకుంఠవాసమేకాని, మళ్ళీ మా అమ్మని, నాన్నని చూస్తానంటే వీలుపడదు?" అన్నాడు సింహాద్రిరావు.

బండి నడుస్తూంది.

'ఔనుగాని, కళ్ళెందుకండి మూసేశారు తమరు!" అని అడిగేడు పెద్దపంతులు కొంచెం కొంటెతనంగా.

"నువ్వు కళ్ళుమూసుకొని బండిలో కూర్చోమనికాదుటయ్యా సలహా ఇచ్చేవు. నీ మాటప్రకారమే." అన్నాడు సింహాద్రిరావు.

ఇద్దరు మేస్టర్లు గుమ్మెమ్మైపోయేరు.

పొద్దు పోతూందని బండివాడు బండ్డిని జోరుచేశాడు.

"ఈరోజున ఏలాగో బతికిపోయాను. జలగండం తప్పవలసింద్దదు కాదు జాతకం ప్రకారం. నా అదృష్టమింకా బాగుంది." అనుకొన్నాడు సింహాద్రిరావు.

చిట్టచివరకి లబ్బర్తిగాము దర్శనంకాగా అందరూ సంతోష పడ్డారు.

"ఈ ఘటాన్ని ఇక్కడికి చేరవేస్తానునుకోలేను." అన్నాడు సింహాద్రిరావు.

"అంతా దేవుడిదయ." అన్నాడు చిన్నపంతులు.

పాపం వాళ్ళు వానలో ఎంత అవస్థపడుతున్నారో. ఏమయిపో యేరో అని ఇనస్పెక్టరు ఆరాటపడుతున్నాడు.

బండివచ్చి గుమ్మందగ్గిర ఆగగా ఇనస్పెక్టరు చాలా సంతోష పడ్డాడు. అందరూ బండి దిగేరు.

సింహాద్రిరావు ఉత్సాహంతో అడుగులువేసి, బడిలోకి వెళ్లేడు. నందకిశోరరావు హస్తచాలనం చేశాడు. తనకోసం ఎదురుచూస్తూన్న కాఫీ ఫలహారాలకి వెంటనే సింహాద్రిరావు తగిన న్యాయమిప్పించేడు.

సింహాద్రిరావు చాటున ఉపాధ్యాయులు. ఇన్స్పెక్టరుకి కథ చెప్పగా, అందరూ పొట్టచెక్కలయేటట్లు నవ్వుకొన్నారు.

సమాప్తం

కాక రాక

కథా నిలయం
6018
శ్రీకాకుళం